

సంప్రదాయ దుస్తుల్లో మెరిసిన విద్యార్థులు

కాకతీయ వైద్య కళాశాల వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఉత్కర్ష-24 కార్యక్రమంలో భాగంగా బుధవారం వైద్య విద్యార్థులు నిర్వహించిన సంప్రదాయ దుస్తుల ప్రదర్శన ఆకట్టుకుంది. ముఖ్య అతిథులుగా హాజరైన కాళోజీ ఆరోగ్యవిశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ సంధ్య, కేఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ రాంకుమార్ రెడ్డి ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. సాయంత్రం నిర్వహించిన డాండియా కార్యక్రమం అలరింపజేసింది.

– న్యూస్‌టుడే, ఎంజీఎం ఆసుపత్రి

దీర్ఘకాలికంగా ఉండేలా మేడారం జాతర పనులు



సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి సీతక్క

ములుగు, న్యూస్‌టుడే: మేడారం జాతరలో చేపట్టే పనులు దీర్ఘకాలికంగా ఉపయోగపడే విధంగా ఉండాలని మంత్రి సీతక్క అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో మినీ మేడారం జాతర నిర్వహణపై కలెక్టర్ టీఎస్.దివాకర, ఎస్పీ శబరిష్, డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్‌తో పాటు వివిధ శాఖల అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. రూ. వందల కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్న అవి శాశ్వతంగా ఉండకపోవడంతో మళ్లీ ఆ పనులను చేపట్టే పరిస్థితి వస్తోందని, ఇప్పటి నుంచి చేపట్టే పనులు దీర్ఘకాలికంగా ఉండేలా చేయాలని అధికారులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం స్పర్శ్ పథకం ద్వారా జాతరకు నిధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఫ్లోరింగ్ పనులతో పాటు మంచినీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు వసతులు కల్పించాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగంపై ఉందని స్పష్టం చేశారు. జిల్లా అధికారులు గతంలో పని చేసిన అధికారుల సూచనలు, సలహాలు తీసుకోవాలన్నారు. తాను స్థానిక ఎమ్మెల్యేగా జాతర అదనపు నిధులు కోసం కృషి చేస్తానని తెలిపారు. జిల్లాకు డైనమిక్ కలెక్టర్ రావడం జిల్లా ప్రజల అదృష్టమన్నారు. 2024 జాతర సమయంలో చేపట్టిన పనుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అదనపు కలెక్టర్‌లు సీహెచ్. మహేందర్‌జీ, సంపత్‌రావు, మేడారం ఈవో రాజేందర్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.అప్పయ్య, పంచాయతీరాజ్, ఆర్ అండ్‌బీ, గిరిజన సంక్షేమం, నీటిపారుదల, విద్యుత్తు శాఖ అధికారులు పాల్గొన్నారు.

వృద్ధుల పెండింగ్ కేసులను పరిష్కరించండి



సమావేశంలో ప్రతిజ్ఞ చేస్తున్న, కలెక్టర్, అధికారులు

హనుమకొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే: వృద్ధుల పోషణ సంక్షేమ చట్టం 2007 ప్రకారం పెండింగ్‌లో ఉన్న కేసులను ఆర్డీవోలు త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ప్రావిణ్య ఆదేశించారు. అక్టోబరు 1న నిర్వహించే అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం నేపథ్యంలో కలెక్టర్ బుధవారం వివిధ శాఖల అధికారులు, వృద్ధుల సంక్షేమ సంఘం ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. వారంరోజుల పాటు నిర్వహించే కార్యక్రమాల గోడ పత్రికలను ఆవిష్కరించారు. తల్లిదండ్రులు, వృద్ధుల సంక్షేమ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ నుంచి బస్టాండు వరకు ర్యాలీ చేపట్టాలని సూచించారు. వృద్ధాశ్రమాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, అవగాహన సదస్సులు చేపట్టాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అమ్మమ్మ, నానామ్మ, తాతయ్యలతో గ్రాండ్ పేరెంట్స్ డే నిర్వహించాలన్నారు. అనంతరం వృద్ధుల హక్కులను సంరక్షిస్తామని అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా సంక్షేమాధికారి రాజమణి, ఆర్డీవోలు వెంకటేష్, నారాయణ, డీఎంహెచ్‌వో డాక్టర్ లలితాదేవి తదితరులు పాల్గొన్నారు.

వర్షాల వేళ.. ఒడిసిపడదాం!

ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రభుత్వ ఉత్తర్వులు



పౌరుల మేలుకొలుపు కోసం..!

నగర పాలక సంస్థతో పాటు పురపాలికల్లో పౌరుల మేలుకొలుపు కోసమన్నట్లు ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టారు. జల శక్తి అభియాన్ పథకం కింద క్యాచ్ ది రెయిన్ పిలుపుతో ఈ కార్యాచరణ అమలు చేశారు. డోర్నకల్ మున్సిపల్ పాలకవర్గం, ఉద్యోగులు ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు.



బాధలన్నీ గట్టెక్కాయి..

ఈ దంపతుల పేర్లు డారియా-రామిని... మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం చాప్లాతండా వాసులు. వీరింట్లో బోరు నుంచి అంతంతమాత్రంగానే నీరు వచ్చేది. ఇంకుడు గుంత నిర్మాణం చేపట్టాక ఇంటి అవసరాలకు సరిపడా నీరొస్తోంది. ఇంట్లో వాడిన నీళ్లు నేరుగా ఇంకుడు గుంతలోకి వెళ్తుండటంతో దోమలు, విష పురుగుల బాధ తప్పింది.

దాహం వేసినప్పుడే ఆలోచిద్దామా..?

ఇప్పుడు వర్షాలు పడుతున్నాయి.. నీరంతా వృథాగా సముద్రం పాలవుతోంది.. కాంక్రీట్ వనంలో చుక్క నీరు కూడా ఇంకడం లేదు.. మళ్లీ వేసవి వచ్చేవరకు తాగునీటికి కటకటే.. అప్పుడు ఇంకుడు గుంతలు గుర్తుకొస్తాయి.. దాహం వేసినప్పుడే.. బావి తవ్వితే ప్రయోజనం ఉంటుందా..? మరేం చేద్దాం..!

ఇదే తరుణం...

తాజాగా వాన నీటిని ఒడిసిపట్టి.. భూగర్భ జలాల పెంపునకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ నడుం బిగించింది. అన్ని పురపాలికలు, నగరపాలక సంస్థల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, 300 చదరపు మీటర్లకు మించిన అన్ని నిర్మాణాల్లో ఇంకుడు గుంత ఉండాలని ఉత్తర్వులు వెలువరించింది.. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగంతో పాటు ఇటు పౌరులూ కదలాలి.

న్యూస్‌టుడే–డోర్నకల్, కార్పొరేషన్, జనగామ

భవనాల నిర్మాణాలకు అనుమతిచ్చేటప్పుడే ఇంకుడుగుంత ఉండేలా తప్పని చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఈ మేరకు విధివిధానాలను పొందుపర్చింది. ఇప్పటికే ఉన్న భవనాల్లోనూ నిర్మించాలి. విద్యా సంస్థలు ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు, అపార్టుమెంట్లు, ప్రైవేటు వాణిజ్య భవనాల్లోనూ తప్పనిసరి. బడా భవనాలకు ఆక్యుపెన్సీ కమ్ కంప్లీషన్ సర్టిఫికెటు ఇచ్చే ముందు ఇంకుడుగుంత నిర్మించారో లేదో అధికారులు పరిశీలించాలి.

డిపాజిట్ వెనక్కి తీసుకున్నవారే లేరు..

భవన నిర్మాణ అనుమతి రుసుములో ఇంకుడు గుంతల డిపాజిట్ చెల్లించి, నిర్మాణం పూర్తయిన పిదప, ఇంకుడు గుంతల డిపాజిట్ రుసుమును వెనక్కి తీసుకోవచ్చు. కానీ, పురపాలికల్లో ఇంకుడు గుంతలు నిర్మించి, రుసుము వెనక్కి తీసుకున్న దాఖలాలు తక్కువే..

మూలుగుతున్న రూ.5 కోట్లు


ఇంకుడు గుంతల నిర్మాణం కోసం గ్రేటర్ వరంగల్ డబ్బులు వసూలు చేసింది. బిల్డింగ్ పర్మిషన్ ఫీజుతో పాటు వాటర్ హార్వెస్టింగ్ ఛార్జీలు తీసుకున్నారు. నివాస గృహాల నుంచి రూ.5 వేలు, అపార్టుమెంట్లు, వ్యాపార, వాణిజ్య భవనాల నుంచి రూ.10వేల పైనే వసూలు చేశారు. 2003 నుంచి నిధులను ప్రత్యేక ఖాతాలో జమ చేశారు. ఇలా రూ.5 కోట్ల నిధులు మూలుగుతున్నాయి. 2013, 2018లో స్పెషల్ డ్రైవ్ ద్వారా కొంతమంది యజమానులు ఇంకుడు గుంతలు నిర్మించినా అసంపూర్తిగా వదిలేశారు.

కానరాని చైతన్యం

పట్టణ ప్రజల్లో చైతన్యం కానరావడం లేదు.. భవన నిర్మాణం జరిగిన చోటల్లా ఇంటి ఆవరణ లేదా పరిసరాల్లో ఇంకుడు గుంత నిర్మాణమనేది నామ మాత్రంగా కనిపిస్తోంది.. ఉమ్మడి జిల్లాలోని పట్టణాల్లో మూడు నెలల క్రితం అధికారులు ఇంటింటా సర్వే చేశారు. గ్రేటర్ వరంగల్ పరిధిలో 300 చదరపు మీటర్లు దాటిన గృహాలు 11,588 ఉన్నాయి. ఇందులో 6,973 ఇళ్లు సర్వే చేయగా.. కేవలం 789 ఇళ్లలో ఇంకుడు గుంతలు నిర్మించగా 768 వాడకంలో ఉండగా, 21 నిరుపయోగంగా ఉన్నాయి. 6184 ఇళ్లలో లేవని తేలింది.

ఇలా నిర్మిద్దాం

ఇంట్లో వాలు స్థలం ఎంపిక చేసుకోవాలి. అనువైన పొడవు, వెడల్పుతో 2 మీటర్ల లోతు గుంత తవ్వాలి. అడుగు భాగాన సగభాగం 40 మి.మీ కంకర, తర్వాత పావు భాగం 20 మి.మీ కంకర నింపాలి. గుంత కొంత భాగం ఖాళీగా ఉండేలా చూసుకొని దొడ్డు ఇసుకతో నింపాలి. తర్వాత వర్షపు నీటి పైపును ఇంకుడు గుంతలోకి మళ్లించాలి. ఇళ్లలో ఖాళీగా ఉన్న బోర్లను కూడా ఇంకుడు గుంతలా చేసి నీటిని మళ్లించవచ్చు.



ఉమ్మడి జిల్లాలో పరిస్థితి ఇదీ

పట్టణాల్లో ఆవాసాలు	3,51,768
అపార్టుమెంట్లు	687
ఇంకుడు గుంతలు	2146

సర్కారు బడిలో సర్దుబాటు

న్యూస్‌టుడే, వరంగల్ విద్యావిభాగం, కమలాపూర్, పరకాల

జిల్లాలో పాఠశాలలపై విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. కొందరు ఉపాధ్యాయులు అధికారుల ఆదేశాలను ఖాతరు చేయడం లేదు. పైరవీలతో అనుకూలమైన చోటుకు డిప్యుటేషన్‌పై వెళ్తున్నారు. దీంతో విద్యార్థులు తక్కువ ఉన్నచోట ఎక్కువ మంది, పిల్లలు ఎక్కువగా ఉన్నచోట తక్కువ మంది ఉపాధ్యాయులు ఉంటున్నారు. ఉపాధ్యాయ పోస్టుల ఖాళీల్లో విద్యా వాలంటీర్లనైనా నియమిస్తారేమోనని ఎదురు చూస్తుంటే.. ప్రభుత్వం సర్దుబాటుకు చర్యలు చేపట్టింది. ఇటీవల జిల్లా విద్యాశాఖ అధికారులు సర్దుబాటులో భాగంగా ఎక్కువ మంది విద్యార్థులున్న పాఠశాలలకు కేటాయిస్తే కొందరు ఉపాధ్యాయులు ఇప్పటి వరకు చేరలేదు. ఇటీవల బదిలీల ప్రక్రియ పూర్తి అయినా కొందరు ఉపాధ్యాయులు రిలీవ్ కాలేని పరిస్థితి. దీంతో ప్రభుత్వం నేరుగా సర్దుబాటు చేయడానికి తాత్కాలిక బదిలీలు నిర్వహించాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది.

పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తి ఇలా..

1-10	11-60	61-90	91-120	121-150	151-200
1	2	3	4	5	6

200 మంది పిల్లలు దాటితే ప్రతి 40 మందికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలి



టీసీలు తీసుకెళ్తున్నారు..

హనుమకొండ లష్కర్‌బజార్‌లోని ఈ అభ్యసన్నోత ప్రాథమిక పాఠశాలలో 354 మంది విద్యార్థులు ఉన్నారు. వారికి బోధన చేయడం కోసం తొమ్మిది మంది ఉపాధ్యాయులు, ఒక ప్రధానోపాధ్యాయుడు ఉన్నారు. ఇంకా ఇద్దరు టీచర్ల అవసరముంది. విద్యా సంవత్సరం ప్రారంభంలో టీచర్లను కేటాయించగా వారు ఇప్పటి వరకు రిపోర్ట్ చేయలేదు. గతేడాది 421 మంది విద్యార్థులు ఉండగా ఉపాధ్యాయుల కొరత కారణంగా చదువులు సాగడం లేదని తల్లిదండ్రులు తమ పిల్లల టీసీలు తీసుకొని వెళ్లారు.

☛ ప్రభుత్వ మర్కజీ ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు 678 మంది విద్యార్థులు ఉన్నారు. మొత్తం 14 సెక్షన్లు ఉన్నాయి. ప్రస్తుతం ఈ పాఠశాలలో ఇద్దరు టీచర్లు అదనంగా ఉన్నట్లు తెలిసింది. హిందీ, తెలుగు సబ్జెక్టలలో కొరత ఉంది. గతంలో హిందీ సబ్జెక్టుకు సర్దుబాటు చేయగా ఆ ఉపాధ్యాయుడు రిపోర్ట్ చేయలేదని తెలిసింది.

జిల్లాలో ఇటీవల ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు జరిగాయి. పలు పాఠశాలల్లో పోస్టులు ఖాళీ అయ్యాయి. విద్యార్థులు ఉన్నా ఉపాధ్యాయులు లేరు. మరి కొన్నిచోట్ల పరిస్థితి దీనికి భిన్నంగా ఉంది. ఈ ప్రభావం విద్యార్థుల చదువులపై పడుతోంది. దీన్ని గుర్తించిన ప్రభుత్వం సర్దుబాటుకు చర్యలు చేపట్టింది. జిల్లా కలెక్టర్లకు తాత్కాలిక బాధ్యతలు అప్పగించింది.

☛ హనుమకొండలోని ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాలలో 601 మంది విద్యార్థులు ఉన్నారు. గణిత బోధనకు ముగ్గురు ఉపాధ్యాయులు ఉండగా.. వారిలో ఒకరు దీర్ఘకాలిక సెలవులో ఉన్నారు. మరొకరు ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. దీంతో ఒక్కరే బోధిస్తున్నారు. బయాలజీ బోధనకు ఇద్దరు ఉండేవారు. ఒకరు ఇటీవల ఉద్యోగ విరమణ చేయడంతో ఒక్కరే మిగిలారు.

☛ శ్రీరాములపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలోనూ 18 మంది విద్యార్థులకు 8 మంది ఉపాధ్యాయులు ఉన్నారు.



వెల్లంపల్లిలో ఇద్దరికి చదువు చెబుతున్న ఓ ఉపాధ్యాయురాలు

విద్యార్థులు 21.. టీచర్లు 8 మంది

పరకాల మండలం వెల్లంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 21 మంది విద్యార్థులకు 8 మంది ఉపాధ్యాయులున్నారు. హెచ్‌ఎం రమాదేవి ఎంఈవోగా ఇన్‌ఛార్జి బాధ్యతలు కూడా నిర్వర్తిస్తున్నారు. గతంలో వంద మందికిపైగా విద్యార్థులుండేవారు. ఏటా వారి సంఖ్య తగ్గుతూ వస్తోంది. ఉపాధ్యాయులు అదనంగా ఉన్నారు.

ప్రైవేటు ఉపాధ్యాయులే దిక్కు..

భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 521 మంది విద్యార్థులు ఉండగా.. ఉపాధ్యాయులు ముగ్గురే ఉన్నారు. మూతపడే పరిస్థితిలో ఉన్న పాఠశాలను గ్రామానికి చెందిన కావేరి విత్తన సంస్థ ఎండీ భాస్కర్‌రావు దత్తత తీసుకొని రూ.4 కోట్లతో అభివృద్ధి చేశారు. చుట్టుపక్కల గ్రామాల విద్యార్థుల కోసం మూడు బస్సులను ఏర్పాటు చేశారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రభుత్వం ఉపాధ్యాయులను నియమించకపోవడంతో సొంత డబ్బులు వెచ్చించి 18 మంది ప్రైవేటు ఉపాధ్యాయులను పెట్టి బోధన చేయిస్తున్నారు. 2016 నుంచి కూడా ఇక్కడ ఉపాధ్యాయుల కొరత ఉంది.

– న్యూస్‌టుడే, భీమదేవరపల్లి



గట్లనర్సింగాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు

విద్యాశాఖ ఆదేశాల మేరకు నడుచుకుంటాం..

- డి.వాసంతి, డీఈవో

పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతపై ప్రభుత్వం ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. దాని మేరకు నడుచుకుంటాం. కలెక్టర్ సూచన, నిబంధనల మేరకు సర్దుబాటు చేస్తాం. పైరవీలకు అవకాశం లేదు. విద్యాశాఖ నిబంధనలు వ్యతిరేకిస్తే చర్యలు తీసుకుంటాం.

వాహనాల మరమ్మతులు జాప్యం చేయొద్దు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: చెత్తను తరలించే వాహనాలకు అత్యవసరంగా మరమ్మతులు చేయాలి, రోజుల తరబడి షెడ్డులో ఉంచితే ఎలా? అని బల్దియా ఇంజినీర్లను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రశ్నించారు. బుధవారం మేయర్ గుండు సుధారాణితో కలిసి బాలసముద్రం వెహికిల్ డిపోను తనిఖీ చేశారు. వాహనాల మరమ్మతులు ఆలస్యం అవుతున్నాయని కార్పొరేటర్లు చెప్పడంతో పరిశీలించారు. ఎన్ని వాహనాలు ఉన్నాయి?, ఎన్ని రోజులుగా బాగు చేయడం లేదో రిజిస్టర్ చూశారు. కొందరు చోదకులు, మెకానిక్‌లు, సిబ్బంది విధులకు రాకపోవడంపై ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

పౌర సేవల్లో కమిషనరేట్ పోలీసులు భేష్



డీజీపీ జితేందర్ నుంచి అవార్డు అందుకుంటున్న శాయంపేట ఠాణా హెడ్‌కానిస్టేబుల్ బి.వెంకట్రామ్ నాయక్, ఆత్మకూర్ ఇన్‌స్పెక్టర్ సంతోష్

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: పౌర సేవలు అందించడంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ అధికారులు అవార్డులు అందుకున్నారు. పోలీస్ స్టేషన్లలోని సన్నిహిత కౌంటర్లలో పనిచేస్తున్న సిబ్బంది, ఠాణాల ద్వారా అందిస్తున్న సేవలు, ఫిర్యాదుల నిర్వహణ, పనితీరు మెరుపరుచుకోవడం తదితర అంశాలపై థర్డ్‌పార్టీ ద్వారా విచారణ జరిపి రాష్ట్ర ప్రభుత్వం పౌరసేవ పతకాలు ఇస్తుంది. జులై, ఆగస్టులో పౌరులకు ఉత్తమ సేవలు అందించినందుకు గాను ఆత్మకూర్, చిల్పూర్ ఠాణాలకు, ఫిర్యాదుల నిర్వహణలో చిత్తశుద్ధితో పనిచేసిన శాయంపేట ఠాణా హెడ్‌కానిస్టేబుల్ బి.వెంకట్రామ్ నాయక్‌కు బుధవారం రాష్ట్ర డీజీపీ జితేందర్ హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో అవార్డు అందించారు. ఉత్తమ పౌరసేవా పతకాలను ఆత్మకూర్ ఇన్‌స్పెక్టర్ సంతోష్, అప్పటి చిల్పూర్ ఎస్సై రాజేందర్ అందుకున్నారు. కమిషనరేట్ పరిధిలో రెండు ఠాణాలతో పాటు హెడ్‌కానిస్టేబుల్‌కు అవార్డు రావడం పట్ల సీపీ అంబర్ కిషోర్ ఝా హర్షం వ్యక్తం చేశారు.

నాణ్యతా ప్రమాణాలతో నియంత్రికల మరమ్మతు



మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

బాలసముద్రం, న్యూస్‌టుడే: విద్యుత్తు నియంత్రికల మరమ్మతులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని, ఈ మేరకు తగిన జాగ్రత్తలు పాటించాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అన్నారు. ఎస్పీఎం షెడ్ల నిర్వాహకులు, అందులో పని చేసే సిబ్బందికి హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్తు భవన్‌లో బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ.. నియంత్రికల వైఫల్యాలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి జిల్లాలో ఆదర్శవంతంగా ఎస్పీఎం షెడ్లు నెలకొల్పుతామని అన్నారు. ఈ నెల 29 వరకు శిక్షణ తరగతులు కొనసాగుతాయని చెప్పారు. విద్యుత్తు భవన్ అధికారులు సదర్‌లాల్, మధుసూదన్, కేఎన్.గుప్త, అన్నపూర్ణ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మౌంట్ గోరిచెన్ పర్వతాన్ని అధిరోహించిన యశ్వంత్


జాతీయ పతాకంతో యశ్వంత్

మరిపెడ, న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లా మరిపెడకు చెందిన పర్వతారోహకుడు భూక్యా యశ్వంత్ ఇటీవల అరుణాచల్ ప్రదేశ్‌లోని మౌంట్ గోరిచెన్ పర్వతాన్ని అధిరోహించి మరో ఘనత సాధించారు. అతి పిన్న వయసులో ఈ ఘనత సాధించిన వ్యక్తిగా చరిత్ర సృష్టించారు. మరిపెడ మండలం భూక్యాతండాకు చెందిన యశ్వంత్ పట్టుదల, కృషి, ఆసక్తితో ప్రపంచంలోని శిఖరాలను అధిరోహిస్తున్నారు. సెప్టెంబర్ 4న ప్రారంభించిన యాత్ర 6488 మీటర్ల ఎత్తైన శిఖరాన్ని 18 రోజుల్లో అధిరోహించి కిందకు దిగినట్లు యశ్వంత్ పేర్కొన్నారు. ఎవరెస్ట్ అధిరోహించాలనే సంకల్పంతో ఒక్కొక్క అడుగు ముందుకు వేస్తున్నట్లు పేర్కొన్నారు. అసోం గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య యశ్వంత్‌కు అభినందనలు తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సాహస అభిమానులు యశ్వంత్‌కు ఫోన్ ద్వారా అభినందనలు తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి


ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రవీందర్, పీఆర్‌టీయూ నాయకులు

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యల సాధన కోసం పీఆర్‌టీయూ కృషి చేస్తుందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండలోని జడ్పీ సమావేశ మందిరంలో సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. వరంగల్ జిల్లా అధ్యక్షుడు రవీందర్ రెడ్డి అధ్యక్షత వహించారు. శ్రీపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సంఘం కృషితోనే ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు జరిగాయని చెప్పారు. సీపీఎస్ రద్దు, ఓపీఎస్ పునరుద్ధరణకు ప్రభుత్వంతో చర్చలు జరుపుతామని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ మాట్లాడుతూ.. టీచర్ల సమస్యలు, పాత బకాయిల చెల్లింపులపై సీఎంను కలుస్తామని అన్నారు. అనంతరం వరంగల్ జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఈదునూరి రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎండీ.అబ్దుల్ గఫార్, అసోసియేట్ అధ్యక్షులుగా కె.రఘు, ఎ.మహేందర్, ఉపాధ్యక్షులుగా పి.మల్లయ్య, సి.సుధాకర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలిగా పి.అర్పితలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండు లక్ష్మణ్, మాజీ ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్, ప్రతిక సంపాదకులు ఇన్నారెడ్డి, ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, మండల బాధ్యులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్


ఫాం:	125
రిటైల్:	147
డ్రెస్డ్:	213
స్కిన్‌లెస్:	243

లక్ష్యం వైపు దూసుకెళ్తున్నారు!

ప్రతిభ గల పేద క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తే.. అద్భుతంగా రాణిస్తారనడానికి ఉదాహరణ ఇది.. సరైన నైపుణ్య శిక్షణ అందిస్తే చక్కటి ఫలితాలు వస్తాయనడానికి తార్కాణమిది.. 'ఈనాడు' సంస్థ తీసుకొచ్చిన 'లక్ష్య' కార్యక్రమం మారుమూల క్రీడాకారుల ప్రతిభను వెలుగులోకి తీసుకొస్తోంది.. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడకు చెందిన జీవాంజీ దీప్తి 'లక్ష్య' ప్రోత్సాహంతో పారిస్ పారాలింపిక్స్‌లో ఏకంగా కాంస్య పతకం కొల్లగొట్టింది. ఆమె స్ఫూర్తిగా హనుమకొండ కేంద్రంగా శిక్షణ తీసుకుంటున్న అథ్లెట్లు రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలతో దుమ్మురేపుతున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో పది పతకాలతో అదరగొట్టారు. ఈ నేపథ్యంలో వారిపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం..

–న్యూస్‌టుడే, వరంగల్ క్రీడావిభాగం

చిరుత వేగంతో..


మహ్మద్ కైఫ్

హుజూరాబాద్‌కు చెందిన స్ప్రింటర్ మహ్మద్ కైఫ్ పరుగులో చిరుత వేగంతో పోటీపడతారు. చిన్నప్పటి నుంచి క్రీడలపై ఆసక్తి ఉండటంతో అథ్లెటిక్స్ ఎంచుకున్నారు. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో 200 మీటర్ల పరుగులో స్వర్ణం, 100 మీటర్ల పరుగులో కాంస్య పతకాలతో ప్రతిభ కనబరిచారు. నాలుగు జాతీయ, ఆరు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న కైఫ్ స్ప్రింట్స్‌లో రికార్డు టైమింగ్ సృష్టిస్తానని చెబుతున్నారు.

రెండు విభాగాల్లో..


రవితేజ

మంచిర్యాలకు చెందిన రవితేజ 3000 మీటర్ల(ఫ్లాట్ రన్), 3000 మీటర్ల స్టీపుల్ చేస్‌లో అత్యంత ప్రతిభతో రాణించాడు. రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీల్లో రెండు విభాగాల్లో కాంస్య పతకాలు కొల్లగొట్టాడు. జాతీయ స్థాయిలో నాలుగు, రాష్ట్ర స్థాయిలో 9 టోర్నీల్లో పాల్గొన్నాడు. అండర్-20 3000 మీటర్ల స్టీపుల్ చేస్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాలని లక్ష్యంగా సాధన కొనసాగిస్తున్నారు. హనుమకొండలోని కాకతీయ డిగ్రీ కళాశాలలో రెండో ఏడాది చదువుతున్నారు.

భారత జట్టులో చోటు కోసం..


సబ్బావత్ దత్తు

నల్గొండకు చెందిన దత్తు నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ రెండో ఏడాది చదువుతున్నారు. లాంగ్‌జంప్, హెప్టాథ్లాన్‌లో తనదైన ప్రదర్శనతో పతకాలు సాధిస్తున్నారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో రెండు స్వర్ణాలు కైవసం చేసుకున్నారు. నిరుపేద రైతు కుటుంబానికి చెందిన దత్తుకు 'లక్ష్య' కేంద్రం అండగా ఉంటూ ఉచితంగా నైపుణ్య శిక్షణ అందిస్తోంది. ఇప్పటివరకు ఐదు జాతీయ స్థాయి, 14 రాష్ట్రా స్థాయి టోర్నీల్లో పాల్గొన్నారు. భారత అథ్లెటిక్స్ బృందంలో చోటు సంపాదిస్తానని అంటున్నారు.

రికార్డు టైమింగ్ నమోదు


గణేష్

హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో గణేష్ రికార్డు టైమింగ్ నమోదు చేశారు. 100 మీటర్ల పరుగును 10.83 సెకండ్లలో పూర్తి చేశారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ టైమింగ్‌గా కోచ్ నాగరాజు తెలిపారు. నల్గొండకు చెందిన రవితేజ హనుమకొండలోని కేడీసీలో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్నారు. రెండేళ్ల క్రితమే రవితేజ 'లక్ష్య'లో చేరారు. నైపుణ్య శిక్షణ అందడంతో పరుగుకు మరింత పదును పెంచారు. మెరుగైన ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయిలోను రికార్డు టైమింగ్ నమోదు చేస్తానని తెలిపారు.

హనుమకొండ జేఎన్ స్టేడియం కేంద్రం

2019లో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం కేంద్రంగా ఈనాడు 'లక్ష్య' అథ్లెటిక్స్ శిక్షణ శిబిరం ప్రారంభమైంది. వరంగల్‌కు చెందిన భారత అథ్లెటిక్స్ జట్టు చీఫ్ కోచ్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేష్ సూచనతో జాతీయ స్థాయి అథ్లెట్ నాగరాజును కోచ్‌గా ఎంపిక చేశారు. కొద్ది మందితో ప్రారంభమైన శిక్షణ అంచెలంచెలుగా జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తాచాటే వరకు చేరారు. ప్రస్తుతం 18 బాలురు, ఒక బాలిక తర్ఫీదు పొందుతున్నారు. వారిలో 15 మంది జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. దత్తు, గణేష్ జాతీయ స్థాయిలో ఏకంగా పతకాలు కొల్లగొట్టారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో పది పతకాలు


హనుమకొండ జేఎన్ స్టేడియంలో శిక్షణలో ఉన్న అథ్లెట్లతో లక్ష్య మెంటర్ నాగపురి రమేష్ (పాత చిత్రం)

దక్షిణ భారత పోటీలకు..

ఇటీవల హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయం క్రీడా మైదానంలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో వరంగల్ లక్ష్య అథ్లెట్లు ఏకంగా పది పతకాలు సొంతం చేసుకున్నారు. దత్తు, కైఫ్, గణేష్, శ్రీధర్, రాఘవ, రవితేజ, తరుణ్‌కుమార్ తమ విభాగాల్లో అద్భుత ప్రదర్శనతో పతకాలు సాధించారు. కైఫ్, గణేష్, శ్రీధర్, రవితేజ, దత్తులు గుంటూరులో అక్టోబర్ 19, 20న జరిగే దక్షిణ భారత అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. పోటీల్లో దత్తు, కైఫ్, రవితేజ రెండేసి పతకాలతో సత్తాచాటారు.

ఆర్మీ ఉద్యోగాలకు ఎంపిక

లక్ష్య శిక్షణ శిబిరానికి చెందిన అథ్లెట్లు 2022, 2023 సంవత్సరాల్లో ఆర్మీ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారిలో నిరోష్, ఆదిత్య కృష్ణ, రోహిత్, శ్రీను, ప్రవీణ్, అభినవ్, రఘునాథ్, సింగ్, నగేష్ శ్రావణ్‌లు ఉన్నారు. ప్రస్తుతం దేశంలోని వివిధ సైనిక శిబిరాల్లో శిక్షణలో ఉన్నారు.

మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం


జనగామ కలెక్టరేట్‌లో ప్రారంభించి భోజనం చేస్తున్న ఎంపీ కావ్య, కలెక్టర్ రిజ్వాన్‌బాషా, తదితరులు

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ఆధ్వర్యంలో జనగామ జిల్లా సచివాలయంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను పాలనాధికారి రిజ్వాన్ బాషాతో కలిసి వరంగల్ ఎంపీ కడియం కావ్య బుధవారం ప్రారంభించి, నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో కలిసి భోజనం చేశారు. కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మంచి నాణ్యతతో కూడిన ఆహార పదార్థాలను అందించాలని నిర్వాహకులకు ఎంపీ సూచించారు. అనంతరం బిల్లు చెల్లిస్తూ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ములుగు జిల్లా కలెక్టర్ పేరిట నకిలీ ఖాతా



ములుగు, న్యూస్‌టుడే: ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పేరుతో సైబర్ నేరగాళ్లు నకిలీ ఫేస్‌బుక్ ఖాతా తెరిచి పలువురికి మెసేజ్‌లు పంపిస్తూ డబ్బులు అడుగుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన కలెక్టర్ అప్రమత్తమై మోసపూరిత మెసేజ్‌లను నమ్మొద్దని, వెంటనే దానిని తొలగించాలని పేర్కొంటూ ఒక ప్రకటన విడుదల చేశారు. కలెక్టర్ పేరులో సమావేశంలో ఉన్నానని అత్యవసరంగా డబ్బులు కావాలని 998886747021 ఉజ్బెకిస్తాన్ నంబర్ నుంచి పలువురికి ఈ సందేశం పంపించి సైబర్ నేరగాడు డబ్బులు ఫోన్ పే చేసి స్క్రీన్ షాట్ షేర్ చేయాలని కోరాడు. దీంతో కలెక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన ఫేస్‌బుక్ అకౌంట్ ద్వారా అందరిని అప్రమత్తం చేశారు. తన పేరుతో ఎవరైనా డబ్బులు అడిగితే ఇవ్వొద్దని సూచించారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

శిక్షణ ఎస్సైలకు ఠాణాల కేటాయింపు

వరంగల్‌క్రైం : పోలీసు శాఖలో ఎంపికై శిక్షణకు కమిషనరేట్‌కు వచ్చిన ఎస్సైలకు ఠాణాలు కేటాయించారు. రెండు ఠాణాల్లో 15 రోజుల చొప్పున విధులు నిర్వర్తించాలి. వివిధ అంశాలపై సీనియర్ అధికారులు అవగాహన కల్పిస్తారు. ఈ నెల 25 నుంచి అక్టోబర్ 9 వరకు, అక్టోబర్ 10 నుంచి 24 వరకు రెండు విడతల్లో శిక్షణ పొందుతారు.

ప్రతిభ చాటేందుకు.. యువజనోత్సవం

స్వామి వివేకానందుడి జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం యువజన సర్వీసుల ఆధ్వర్యంలో ఏటా యువజనోత్సవం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా యువత ప్రతిభ చాటేందుకు అవకాశం కల్పిస్తోంది. రాష్ట్ర సంచాలకుడు, యువజన సర్వీసుల శాఖల ఆదేశాల మేరకు పాలనాధికారి అధ్యక్షతన జిల్లా యువజన, క్రీడల ఆధ్వర్యంలో ఈ నెల 28న యువజనోత్సవాలను నిర్వహించనున్నారు. జానపద నృత్యాలు, జానపద గేయాలు విభాగంలో వ్యక్తిగత, బృంద పోటీలు ఉంటాయి. కవిత్వం, వ్యాసరచన, పోస్టర్ రూపకల్పన, వక్తృత్వ పోటీలు ఉంటాయి. సైన్స్ మేళాను యువజనోత్సవాల్లో మొదటిసారి ప్రవేశపెట్టారు. సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాల్లో నైపుణ్యాన్ని వెలికితీయడమే లక్ష్యంగా ఈ పోటీలు ప్రవేశపెట్టారు. యువత సొంతంగా తయారు చేసిన ప్రాజెక్టులు, నమూనాలు ప్రదర్శించవచ్చు. యువకృతి విభాగంలో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన హస్తకళలను అర్థం చేసుకోడానికి యువజన క్రీడల శాఖ అవకాశం కల్పిస్తోంది. దీని కోసం హస్త కళలు, వస్త్రాలు, వ్యవసాయ ఉత్పత్తులు, తదితర అంశాలపై గరిష్ఠంగా ఇద్దరు వ్యక్తులు ముఖాముఖిలో పాల్గొనేందుకు అవకాశం ఉంది. యువజనోత్సవాలను యువతీ యువకులకు మూడు దశల్లో పోటీలు నిర్వహిస్తారు. మొదటి దశ జిల్లా స్థాయిలో ఈ నెల 28న, రెండో దశ హైదరాబాద్‌లో, మూడో దశ జనవరి 12-16 వరకు కర్ణాటకలో జాతీయ స్థాయి పోటీలు ఉంటాయి. 15 నుంచి 29 ఏళ్ల మధ్యనున్న యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ములుగు జిల్లా యువజన, క్రీడల అధికారి తుల రవి కోరారు.


జానపద నృత్యం చేస్తున్న బృందం (పాత చిత్రం)

యువజన సంబరం

–న్యూస్‌టుడే, ములుగు టౌన్

నైపుణ్య ప్రదర్శనకు.. కళా ఉత్సవ్

విద్యార్థులు చదువుకే పరిమితం కాకుండా వివిధ దశల్లో ప్రతిభ చాటేందుకు ఎన్‌సీఈఆర్టీ, తెలంగాణ సమగ్ర శిక్షా అభియాన్ సంయుక్తంగా 'కళా ఉత్సవ్' పేరుతో పలు రకాల పోటీలు నిర్వహిస్తున్నాయి. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పోటీల నిర్వహణకు విద్యాశాఖ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. తొమ్మిది, పదో తరగతి, ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అర్హులు. విద్యార్థులు ఏదైనా కళను ప్రదర్శించవచ్చు. దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సమాచారం ఇవ్వాలి. మండల, జిల్లా స్థాయి పోటీలు జిల్లా విద్యాధికారుల సూచనల మేరకు ఈ నెలాఖరు నాటికి నిర్వహిస్తారు. అక్టోబరులో రాష్ట్ర స్థాయి, నవంబరులో జాతీయ స్థాయిలో పోటీలు జరగనున్నాయి. జాతీయ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన కళాకారులకు నగదు బహుమతులు, పథకాలు, ప్రశంసాపత్రాలు అందజేస్తారు. స్వర సంగీతం, వాయిద్య సంగీతం, నృత్యం, థియేటర్, దృశ్యకళ, సంప్రదాయక కథ చెప్పడం వంటి అంశాలపై ప్రధానంగా పోటీలు ఉంటాయి. ఉప అంశాలైన జానపద, క్లాసికల్ నృత్యాలు, సంగీతం, సంప్రదాయ చిత్రాలు, హిందుస్థానీ, కర్ణాటక, జానపదం, చిత్రలేఖనం, శిల్పకళ, కథలు చెప్పడం, నాటకంలో కళాకారులు తమ ప్రతిభ చూపవచ్చు. 'వివిధ కళల్లో విద్యార్థులు ప్రతిభ చాటేందుకు 'కళా ఉత్సవ్' ఓ మంచి వేదిక.. జిల్లా విద్యాధికారి సూచనల మేరకు ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు పాల్గొనేలా ప్రధానోపాధ్యాయులు చొరవ చూపాలని అకాడమిక్ క్వాలిటీ సమన్వయకర్త కె.లక్ష్మణ్ చెప్పారు.


నృత్యం చేస్తున్న విద్యార్థిని(పాతచిత్రం)

– న్యూస్‌టుడే, భూపాలపల్లి, మానుకోట

పనులు వేగిరం.. దక్కిన ఫలితం

ఎన్‌హెచ్‌సీ పోటీల్లో ఓరుగల్లు సత్తా

కార్పొరేషన్, న్యూస్‌టుడే: చారిత్రక ఓరుగల్లు మహా నగరానికి జాతీయస్థాయిలో గుర్తింపు లభించింది. మూడేళ్లుగా నిర్వహిస్తున్న నైబర్ హుడ్ ఛాలెంజ్(ఎన్‌హెచ్‌సీ) పోటీల్లో గ్రేటర్ వరంగల్ సత్తా చాటింది. బెంగళూరు, ఇండోర్, జబల్‌పూర్, కొచ్చితో పాటు వరంగల్ నగరానికి నైబర్ హుడ్ ఛాలెంజ్ పోటీల్లో 'ఎక్సలెన్స్ సర్టిఫికెట్' దక్కింది. బుధవారం దిల్లీలో కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణశాఖ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో స్మార్ట్‌సిటీ మిషన్ డైరెక్టర్ రాహుల్ కపూర్ చేతుల మీదుగా బల్దియా ఎస్‌ఈ ప్రవీణ్‌చంద్ర, ఏఈ కార్తీక్‌రెడ్డి ఎక్సలెన్స్ ధ్రువపత్రం అందుకున్నారు.


దిల్లీలో స్మార్ట్‌సిటీ ఎండీ రాహుల్ కపూర్ నుంచి ధ్రువపత్రం అందుకుంటున్న గ్రేటర్ వరంగల్ ఎస్‌ఈ ప్రవీణ్‌చంద్ర, చిత్రంలో ఏఈ కార్తీక్‌రెడ్డి

ఎందుకు వచ్చిందంటే..!

దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన 100 స్మార్ట్‌సిటీ నగరాలకు మూడేళ్ల క్రితం మొదటి దశలో నర్చరింగ్ నైబర్ హుడ్ ఛాలెంజ్ పేరుతో నిధులు కేటాయించారు. స్మార్ట్‌సిటీ మిషన్ జారీ చేసిన నిర్ణీత సమయంలో అధికారులు వరంగల్ దేశాయిపేట ఎంహెచ్‌నగర్‌లో 56 గంటల్లో చిట్టి పార్కు ఏర్పాటు చేశారు. ఇదే విధంగా క్రిస్టియన్ కాలనీ, కరీమాబాద్ గుండుబావి, హనుమకొండ శ్రీనగర్ కాలనీలో పార్కులు సిద్ధం చేశారు. హనుమకొండ అంబేడ్కర్ కూడలిలో బుద్ధ ప్లాజాను నిర్ణీత సమయంలో పూర్తి చేశారు. ఈ వివరాలన్నీ కేంద్ర పట్టణాభివృద్ధి శాఖకు పంపించారు. ఈ నేపథ్యంలో గుర్తింపు దక్కింది.

వరంగల్‌కు గర్వకారణం

- గుండు సుధారాణి, మేయర్

'నైబర్ హుడ్ ఛాలెంజ్' పోటీల్లో వరంగల్ నగరానికి ఎక్సలెన్స్ సర్టిఫికెట్ దక్కడం గర్వంగా ఉంది. ఈ స్ఫూర్తితో నగర సుందరీకరణ కొనసాగిస్తాం. రెండో దశ పోటీ కోసం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ నిధులు ఇవ్వనుంది. వాటితో మరిన్ని పార్కులు అభివృద్ధి చేస్తాం.


పార్కు ముఖ ద్వారం పరిస్థితి ఇది


నిలిచిన వర్షం నీరు

సరిగమ.. నిర్వహణ మమ!

ఫోకస్


కూలిన స్తంభాలు

ఒకప్పుడు ఆ పార్కులోకి వెళ్తే సప్త స్వరాలు వింటున్న అనుభూతి కలిగేది. . శిల్ప సౌందర్యం, పచ్చని పరిసరాలు ఆహ్లాదంగా కనిపించేవి.. నేడు మాత్రం విరిగిన ముఖద్వారం తాలూకు శిల్పాలు, అక్కడక్కడా అందమైన శిల్పాలకు పెట్టిన లైట్లు దొంగలపాలయ్యాయి. నిర్వహణ లేక ఆ పార్కు ఇలా కనిపిస్తోంది. లక్షలు వెచ్చించి ఖర్చు చేసినా ఉపయోగం లేకుండా పోయింది. హనుమకొండలోని పద్మాక్షి రోడ్‌లోని సరిగమ పార్కు దుస్థితి ఇది. – ఈనాడు, హనుమకొండ


దొంగల పాలైన శిల్పాల ముందు లైట్లు

రాష్ట్రస్థాయి జూడో పోటీలు షురూ!

వరంగల్ క్రీడావిభాగం : రాష్ట్రస్థాయి జూడో పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్‌ఐ) రాష్ట్రస్థాయి పోటీలు పోచమ్మమైదాన్ సమీపంలోని కెమిస్ట్రీ భవన్‌లో జరిగాయి. ముఖ్య అతిథిగా ఒలింపిక్ సంఘం కార్యదర్శి కైలాస్‌యాదవ్ హాజరై పోటీలను ప్రారంభించారు. ఉమ్మడి పది జిల్లాలకు చెందిన క్రీడాకారులు హాజరయ్యారు. ఎస్‌జీఎఫ్‌ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి దస్రునాయక్ మాట్లాడుతూ.. సుమారు 200 మంది క్రీడాకారులు హాజరయ్యారన్నారు. క్రీడాకారులకు ఉచిత భోజన వసతి కల్పించినట్లు వివరించారు. ఈ నెల 27 వరకు పోటీలు జరుగుతాయన్నారు. వివిధ జిల్లాల కోచ్‌లు, ప్రభుత్వ పీఈటీలు పాల్గొన్నారు.

బీటీరోడ్డుకు బంగారు వర్ణం



ఈ ఏడాది మొక్కజొన్న పంటకు మార్కెట్లో మంచి ధర ఉండటంతో అన్నదాతలు సంతోషపడుతున్నారు. ప్రస్తుతం క్వింటాలు ధర రూ.2500 లకు పైనే ఉంది. తేమ లేకుండా నాణ్యమైన పంటకు మరింత మంచి ధర లభిస్తోంది. దీంతో రైతులు ఎక్కడికక్కడ మక్కలను రోడ్లపై ఆరబెడుతున్నారు. హనుమకొండలోని కడిపికొండలో రైతు గంగుల భరత్‌కుమార్‌రెడ్డి తన రెండు ఎకరాల పొలంలో పండించిన మొక్కజొన్న కంకులను రోడ్డుపై ఆరబోయగా.. భూమికి బంగారు వర్ణం పూసినట్లు కనిపిస్తున్న చిత్రాన్ని 'ఈనాడు' క్లిక్ మనిపించింది. – ఈనాడు,హనుమకొండ

అధ్వాన రహదారితో అవస్థలు



భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. జాతీయ రహదారి నుంచి గ్రామం వరకు కిలోమీటరు రహదారిలో తారు లేని పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో గ్రామానికి ఆర్టీసీ బస్సు రావడం లేదని గ్రామస్థుడు శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం రోడ్డుకు మరమ్మతులు చేపట్టి బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు కోరారు.

– న్యూస్‌టుడే, భీమదేవరపల్లి

సూచిక బోర్డులను కమ్మేసిన నిర్లక్ష్యం



కాకతీయ విశ్వవిద్యాలయంలోని అన్ని విభాగాలకు దారి చూపడానికి ఏర్పాటు చేసిన సూచిక బోర్డులు నిర్లక్ష్యానికి గురయ్యాయి. కేయూ మొదటి ద్వారం నుంచి రెండో ద్వారం వరకు ప్రధాన రోడ్డుకు ఇరువైపులా పెట్టిన వీటిని చెట్లు, కొమ్మలు కమ్మేశాయి. ప్రస్తుతం పీజీ ప్రవేశాలు కొనసాగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న విద్యార్థులు విభాగాలకు దారి తెలియక ఇబ్బందులు పడుతున్నారు.

– న్యూస్‌టుడే, కేయూ క్యాంపస్

సమాధుల కూల్చివేత సమంజసమేనా?

కార్పొరేషన్, న్యూస్‌టుడే: అభివృద్ధి పనుల పేరుతో పోతనబస్తీలోని కరీమాబాద్ సారంగపురంలోని హిందూ శ్మశాన వాటికలో సమాధులను కూల్చడం ఎంత వరకు సమంజసం అని భాజపా వరంగల్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్, రాష్ట్ర నాయకుడు కుసుమ సతీష్ ప్రశ్నించారు. బుధవారం సాయంత్రం శ్మశానవాటిక పరిరక్షణ కమిటీ ప్రతినిధులతో కలిసి గ్రేటర్ వరంగల్ కమిషనర్ డా.అశ్విని తానాజీని కలిసి వినతిపత్రం ఇచ్చారు. దీనిపై విచారణ జరిపించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

క్యాన్సర్ స్టెమ్ సెల్స్‌పై పరిశోధన అవసరం



వివరణ పత్రాలను విడుదల చేస్తున్న హెచ్‌యూసీ ఆచార్యులు గీత, రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి తదితరులు

విద్యానగర్, న్యూస్‌టుడే: క్యాన్సర్ స్టెమ్ సెల్స్‌పై పరిశోధన అవసరమని హెచ్‌యూసీ ఆచార్యులు గీత అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం జంతు శాస్త్ర విభాగంలో 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ ఎనిమల్ సైన్సెస్' అంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో ఆమె ప్రసంగించారు. సాధారణ కణాలు ఉత్పరివర్తనం చెందడం వల్ల అవి క్యాన్సర్ కణాలుగా మారి, శరీరంలోని ఇతర భాగాలకు వ్యాప్తి చెందుతాయన్నారు. కేయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి మట్లాడుతూ.. బయోటెక్నాలజీలో దేశం ముందుకు పోతోందని, విద్యార్థులకు వీటిపై అవగాహన అవసరం అన్నారు. అనంతరం ఆచార్యులు శమిత, వెంకయ్య, సహ ఆచార్యులు ఇస్తారిలతో కలిసి వివరణ పత్రాలను విడుదల చేశారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి



కార్యక్రమంలో మట్లాడుతున్న సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా

విద్యానగర్, న్యూస్‌టుడే: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా అన్నారు కాకతీయ విశ్వవిద్యాలయం మహిళా ఇంజినీరింగ్ కళాశాల 11వ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం వర్సిటీ సెనెట్ హాల్‌లో ప్రిన్సిపల్ కే.భిక్షాలు అధ్యక్షతన నిర్వహించారు. డీసీపీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థినులు బాగా చదువుకొని ఆర్థిక స్వాతంత్ర్యాన్ని పెంపొందించుకోవాలని, జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. వరంగల్ శిశు సంక్షేమ కమిటీ ఛైర్‌పర్సన్ ఎస్.నాగరాణి, విశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యులు ఎన్.సుదర్శన్, బి.సురేష్‌లాల్, చిర్ర రాజు, బి.రమ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

వేలేరు, న్యూస్‌టుడే: క్రషర్ల యజమానులు నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని భూగర్భ గనుల శాఖ హనుమకొండ జిల్లా ఆర్‌ఐ చంద్రకళ, తహసీల్దార్ కోమి హెచ్చరించారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మైనింగ్ పర్యవేక్షణ కమిటీ బుధవారం వేలేరు మండలంలోని పలు గ్రామాల్లో గుట్టలను, క్రషర్లను పరిశీలించింది. మొరం, మట్టి అక్రమ తరలింపు వెంటనే నిలిపివేయాలని అన్నారు. ఎస్‌ఐ సురేష్, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, రెవెన్యూ, భూగర్భ గనుల శాఖ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎస్ఈగా రాజయ్యకు పదోన్నతి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: గ్రేటర్ వరంగల్ ఇంజినీరింగ్ విభాగం ఈఈ, ఇన్‌ఛార్జి ఎస్ఈగా ఉన్న రాజయ్యకు ఎస్ఈగా పదోన్నతి కల్పిస్తూ బుధవారం సాయంత్రం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి దాన కిశోర్ జీఓ నంబరు 149 జారీ చేశారు. ఇక నుంచి రాజయ్య పూర్తిస్థాయి ఎస్ఈగా వ్యవహరిస్తారు.

బల్దియా ఎదుట కార్మికుల ధర్నా



రంగంపేట, న్యూస్‌టుడే: వరంగల్ మహా నగరపాలక సంస్థ ఒప్పంద ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ధర్నా చేశారు. తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో బల్దియా ప్రధాన కార్యాలయం ముందు నిరసన తెలిపారు. కార్మిక సంఘం నాయకులు సింగారపు బాబు, జన్ను ప్రకాష్, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏబీ బర్దన్ ఆశయాలను కొనసాగిస్తాం



న్యూ శాయంపేటలో నివాళి అర్పిస్తున్న సీపీఐ నేతలు

బాలసముద్రం, న్యూస్‌టుడే : దేశంలోని లౌకిక శక్తులను ఏకం చేసి పోరాటం సాగించిన సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి ఏబీ బర్దన్ ఆశయాలు కొనసాగిస్తామని పార్టీ నాయకులు కర్రె భిక్షపతి, నేదునూరి జ్యోతి అన్నారు. బుధవారం బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో బర్దన్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. దేశ స్వాతంత్ర్య సంగ్రామంతో పాటు బర్దన్ తుదిశ్వాస వరకు కూడా అణగారిన వర్గాల కోసం నినదించారన్నారు. కార్యక్రమంలో ఎల్లేష్, శ్రీనివాస్, సారంగపాణి, శంకర్, రాజేందర్, అశోక్ పాల్గొన్నారు.

న్యూశాయంపేట : 31వ డివిజన్ న్యూశాయంపేట కూడలిలో ఏబీ బర్దన్ చిత్రపటానికి నివాళి అర్పించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి, సీపీఐ నాయకులు సిరబోయిన కర్ణాకర్, శ్రీనివాస్, పూర్ణచందర్, రాజు, హనుమంతు, నాగరాజ్, సురేష్, భరణి, పూర్ణచారి, కుమార్ పాల్గొన్నారు.

ఒప్పంద ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎంజీఎం ఆసుపత్రి: కాకతీయ వైద్య కళాశాలలో వివిధ విభాగాల్లో ఒప్పంద(కాంట్రాక్టు) పద్ధతిలో 68 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 4 సీఏఎస్ ఆర్ఎంఓ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేఎంసీ ప్రిన్సిపల్ డా.రాంకుమార్‌రెడ్డి తెలిపారు. అర్హులు సంబంధిత ధ్రువపత్రాలతో ఈ నెల 27 నుంచి అక్టోబర్ 3వ తేదీలోపు ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు కేఎంసీ ప్రిన్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. దరఖాస్తు ఫారం ఇతర వివరాలకు కళాశాల వెబ్‌సైట్ https://www.kmcwgl.com చూడాలన్నారు.

'అంకితభావంతో పనిచేస్తా ఆదరించండి'



కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో నరేందర్‌రెడ్డి

భీమదేవరపల్లి, న్యూస్‌టుడే: నిరుద్యోగ, ఉద్యోగ సమస్యల పరిష్కారం కోసం అంకిత భావంతో పని చేస్తానని, పట్టభద్రులు ఆదరించాలని ఎమ్మెల్సీ అభ్యర్థి, ఆల్ఫోర్ విద్యా సంస్థల అధినతే వుట్కూరి నరేందర్‌రెడ్డి కోరారు. బుధవారం భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ములుకనూర్ ప్రజా గ్రంథాలయాన్ని సందర్శించారు. హరిత హోటల్, ములుకనూర్‌లో పట్టభద్రులతో సమావేశమై మాట్లాడారు. కొత్తకొండలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని యువకులు కోరగా సానుకూలంగా స్పందించారు. ఆయన వెంట గజ్జల రమేష్, తిరుపతినాయక్, కిరణ్ తదితరులు ఉన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, చిత్రంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు

న్యూశాయంపేట, న్యూస్‌టుడే: అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు అన్నారు. బుధవారం 31వ డివిజన్ న్యూశాయంపేట కూడలిలోని నందనార్ మాల కల్యాణ పరిచయ వేదిక భవన నిర్మాణ పనులకు వారు శంకుస్థాపన చేశారు. తొలుత భవన నిర్మాణానికి కృషి చేసిన నాయకుడు అంకేశ్వరపు వెంకటమల్లు మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మామిండ్ల రాజు, మాజీ కార్పొరేటర్లు వేల్పుల మోహన్‌రావు, మాడిశెట్టి శివశంకర్, రమేష్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు అంకేశ్వరపు సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

రేపు 'మోషన్ టాలెంట్ టెస్ట్'



కరపత్రికలు ఆవిష్కరిస్తున్న ఛైర్మన్ వేణుగోపాల్‌గౌడ్, అధ్యాపకులు

నయీంనగర్, న్యూస్‌టుడే: హనుమకొండ నయీంనగర్‌లోని మోషన్ ఐఐటీ, నీట్ శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం టాలెంట్ సెర్చ్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఛైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు. బుధవారం శిక్షణ కేంద్రంలో పరీక్షకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని చెప్పారు. దేశ వ్యాప్తంగా జరిగే ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉపకార వేతనాలు, 500 మంది విద్యార్థులకు ఉచిత విద్యను అందించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 97030 00850 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్ పెరుమాండ్ల అనిల్‌గౌడ్, బ్రాంచి హెడ్ సురేష్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత భద్రూనాయక్



సంస్మరణ సభలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ సీతారాంనాయక్

న్యూశాయంపేట, న్యూస్‌టుడే: వరంగల్ ఉమ్మడి జిల్లాలోని దళిత, గిరిజన విద్యార్థులకు ఆచార్య భద్రూనాయక్ స్ఫూర్తిప్రదాత అని మాజీ ఎంపీ సీతారాం నాయక్ అన్నారు. బుధవారం హంటర్‌రోడ్డులోని తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞాన పీఠం ప్రాంగణంలో పీఠాధిపతి ఆచార్య బాబురావు అధ్యక్షతన భద్రూనాయక్ సంస్మరణ సభ జరిగింది. సీతారాం నాయక్ మాట్లాడుతూ బంజారాల జీవిత చరిత్రను ప్రపంచానికి పరిచయం చేయాలనే భద్రూనాయక్ ఆశయాలను నెరవేర్చాల్సిన అవసరం ఉందన్నారు. సభకు బాబూరావు అధ్యక్షత వహించారు. ఆచార్య మల్లారెడ్డి, తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, ఆచార్యులు వెంకటనారాయణ, సారంగపాణి, ఎర్రగట్టుస్వామి, రవీందర్, వివిధ ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి

బాలసముద్రం, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను సమష్టిగా ప్రతిఘటించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి పిలుపునిచ్చారు. బుధవారం నక్కలగుట్టలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన బ్లాక్‌డే కార్యక్రమంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేసి, పాత చట్టాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉప్పలయ్య, అశోక్, సంపత్, రజిత, యాకయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్ ఉద్యోగుల ఐకాస కమిటీ ఎన్నిక

కార్పొరేషన్: వరంగల్ మహా నగరపాలక సంస్థ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ కమిటీ నూతన కమిటీని బుధవారం సాయంత్రం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా బిర్రు శ్రీనివాస్, సలహాదారులుగా బొట్ల భిక్షపతి, ధర్మరాజు, అధ్యక్షుడిగా బొట్ల రమేశ్, ప్రధాన కార్యదర్శిగా బాకం సంతోష్, కోశాధికారిగా కట్కూరి స్వర్జన్ రాజు, కార్యదర్శిగా బాలునాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. నాయకులు రాజారపు భాస్కర్, పుల్లా రమేశ్, జీవన్, పాశం రవి, సత్యం పాల్గొన్నారు.

పండిట్ దీన్‌దయాళ్ జీవితం స్ఫూర్తిదాయకం



దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న భాజపా జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, నాయకులు

సుబేదారి, న్యూస్‌టుడే: పండిట్ దీన్‌దయాళ్ జీవితం ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని భాజపా జిల్లా అధ్యక్షురాలు రావుపద్మ అన్నారు. బుధవారం భాజపా కార్యాలయంలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు సంతోష్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, సత్యనారాయణ, మధు, జైపాల్‌రెడ్డి, సాగర్, అరణ్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దామెర: మండలంలోని ల్యాదళ్ల గ్రామంలో బుధవారం పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డా.విజయచందర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అంత్యోదయ పథకం ద్వారా చిట్టచివరి పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించాలని సూచించిన మహనీయుడని కొనియాడారు. భాజపా మండల అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

న్యూశాయంపేట, న్యూస్‌టుడే: పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా 31వ డివిజన్ న్యూశాయంపేటలో భాజపా నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు పెరుగు సురేష్, బండి సదానందం, బాబురావు, చంద్రపాల్, ధనలక్ష్మి, పావని, మౌనిక, శివ పాల్గొన్నారు.

● **కమలాపూర్:** మండల కేంద్రంలోని ఎంపీ ఈటల రాజేందర్ నివాసంలో భాజపా నాయకులు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్ర పటానికి నివాళి అర్పించారు. అనంతరం బస్టాండు కూడలిలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. జమ్మికుంట జడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీరాంశ్యాం, నాయకులు కె.అశోక్‌రెడ్డి, తుమ్మ శోభన్‌బాబు, ప్రవీణ్, కె.అరవింద్, బండి కోటేశ్వర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మడికొండ : కాజీపేట మండలం మడికొండలో పండిట్ దీన్‌దయాళ్ జయంతిని నిర్వహించారు. కార్పొరేటర్ మునిగాల సరోజన, నాయకులు పాపారావు, గడ్డం మహేందర్, బొల్లికొండ వినోద్, దువ్వ నవీన్, పిట్టల రమేశ్, కేతిక సదానందం, బాలరాజు, కుమార్‌బాబు, మౌళి, నిఖిల్‌రావు, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు రూ.1.53 కోట్లు మంజూరు

ఎల్కతుర్తి, న్యూస్‌టుడే: ఎల్కతుర్తి మండల కేంద్రం ముఖ ద్వారంతో పాటు కూడలి అభివృద్ధి కోసం కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) రూ.1.53 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి బుధవారం తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు ఈ నెల 12న ఎల్కతుర్తి కూడలి అభివృద్ధి పనుల కోసం కలెక్టర్ ప్రావిణ్య, కుడా వైస్ ఛైర్‌పర్సన్ అశ్వినీ తానాజీతో పాటు అధికారులు పరిశీలించారు. అలాగే ఈ నెల 23న మంత్రి పొన్నం ప్రభాకర్ దీనిపై సమీక్ష నిర్వహించారు. పనుల కోసం నిధులు మంజూరు చేశారు.

పంచాయతీల్లో పారిశుద్ధ్యంపై దృష్టి

భీమదేవరపల్లి, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని డీఆర్‌డీవో నాగపద్మజ సూచించారు. బుధవారం భీమదేవరపల్లి మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ క్షేత్ర సహాయకులతో సమావేశమయ్యారు. ఉపాధిహామీ పనులు వేగవంతం చేసి, మొక్కలు సంరక్షించాలన్నారు. అర్హులైన లబ్ధిదారులకు వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించాలన్నారు. మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో వీరేశం పాల్గొన్నారు.

పోలీసు అధికారినంటూ సైబర్ మోసం

కమలాపూర్: మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తికి నాలుగు రోజుల కిందట వాట్సప్ కాల్ వచ్చింది. పోలీసు అధికారిని మాట్లాడుతున్నా.. మీ అబ్బాయిని ఒక కేసులో అరెస్టు చేస్తున్నామని చెప్పారు. రూ.50 వేలు ఇస్తే వదిలేస్తామని, లేకుంటే జైలుకెళ్తాడని చెప్పారు. దీన్ని నమ్మిన వ్యక్తి ఆందోళనకు గురైన వ్యక్తి అతను చెప్పినట్లు చేశాడు. తరవాత అతను తన కుమారుడికి ఫోన్ చేయడంతో అదంతా మోసమని బయటపడింది. బాధితుడు ఆన్‌లైన్‌లో సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించారు. వారి సూచనలతో కమలాపూర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఐ హరికృష్ణ ఐటీ చట్టం, బీఎన్ఎస్ చట్టాల కింద కేసు నమోదు చేశారు.

స్థిరమైన పద్ధతులతో అధిక దిగుబడులు

ధర్మసాగర్: స్థిరమైన పద్ధతులపై దృష్టి సారించడం వల్ల పంటలు మెరుగుపడి అధిక దిగుబడులు వస్తాయని ఎస్ఆర్ యూనివర్సిటీ వ్యవసాయ విభాగం డీన్ భూపాల్‌రాజు అన్నారు. ధర్మసాగర్ మండలం ఎలుకుర్తి, శాయిపేట, ముప్పారం గ్రామాల్లో అగ్రికల్చర్ విద్యార్థులు రావెప్‌లో భాగంగా పీఆర్ఏ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎలుకుర్తిలో జరిగిన కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ జి భూపాల్‌రాజు, గ్రామ కోఆర్డినేటర్ డాక్టర్ శ్యాంబాబు, ఏఈవో హరీష్ మాట్లాడారు. విద్యార్థులు గ్రామాల్లో మహిళా సంఘాలతో, రైతులతో మాట్లాడి గ్రామాల ఆర్థిక స్థితిగతులపై సర్వే చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



అంబేడ్కర్ కూడలి వద్ద సైకిల్ ర్యాలీ చేస్తున్న ఆదర్శ పాఠశాల విద్యార్థులు

భీమదేవరపల్లి: పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఆదర్శ పాఠశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం భీమదేవరపల్లి మండలం ములుకనూర్ అంబేడ్కర్ కూడలి వద్ద పాఠశాల విద్యార్థులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పర్యాటక రంగాన్ని ప్రోత్సహించాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. యువ క్లబ్ ఇన్‌ఛార్జి అచరిత, ఉపాధ్యాయులు సందీప్, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లు పరిశీలన

ఎల్కతుర్తి: మండలంలోని పెంచికల్‌పేట్ శివారు వద్ద శ్రీబాలాజీ రైస్‌మిల్లులో ఐదు రోజుల క్రితం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీ చేసిన విషయం తెలిసిందే. మిల్లు యజమాని సీఎంఆర్ ధాన్యాన్ని పక్కదారి పట్టించడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ఫిర్యాదు మేరకు క్రిమినల్ కేసు నమోదు అయింది. బుధవారం ఎల్కతుర్తి సీఐ పులి రమేష్, ఎస్ఐ రాజ్‌కుమార్ మిల్లును పరిశీలించి, వివరాలు సేకరించారు.

సంక్షిప్తంగా

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

బాలసముద్రం: కేయూసీ సబ్ స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు పలు కాలనీల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎన్పీడీసీఎల్ ఆపరేషన్స్ విభాగం హనుమకొండ డీఈ సాంబరెడ్డి తెలిపారు. అలాగే నక్కలగుట్ట సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9:30 నుంచి 11 గంటల వరకు, వడ్డేపల్లిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, బాలసముద్రం స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి 9 గంటల వరకు కరెంటు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

'ప్రజా మద్దతును కోల్పోయిన కాంగ్రెస్'

ఐనవోలు: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బలహీనంగా ఉందని, ప్రజా మద్దతు కోల్పోయిందని భాజపా సభ్యత్వ నమోదు జిల్లా ఇన్‌ఛార్జి గోలి మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పంథినిలో మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్‌తో కలిసి ఇంటింటికి తిరిగి పార్టీ సభ్యత్వ నమోదు చేయించారు. నాయకులు తిరుపతిరెడ్డి, మహేందర్‌రెడ్డి, సతీష్ కురుమ, మధుగౌడ్, మహేష్‌గౌడ్, ప్రణయ్, మణికంఠ పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు సమస్య పరిష్కరించండి

మడికొండ: రాంపూర్‌లోని డంపింగ్ యార్డులో చెత్త కాలుస్తుండటంతో మడికొండతోపాటు పరిసర పది గ్రామాల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నామని జిల్లా వడ్డెర సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున్ అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దాన కిశోర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు.

ఆత్మస్థైర్యం దెబ్బతీయడానికే కేసులు

మడికొండ: మడికొండ ప్రజలు ప్రమాదాల బారిన పడి చనిపోతున్నారని సర్వీస్ రోడ్డులో ధర్నా చేస్తే కేసుల పాలు చేసి ఆత్మస్థైర్యం దెబ్బతీస్తున్నారని యువకులు పేర్కొన్నారు. మడికొండ గ్రామంలో నుంచి లారీలు, టిప్పర్లు తిరగడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానిక యువకులు ధర్నా చేయడంతో పోలీసులు వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేసుపై న్యాయ పోరాటం చేస్తామని దువ్వ నవీన్, పొనగోటి వెంకటరావు, వినోద్, రంజిత్, మౌళి ఉన్నారు.

గంజాయి పట్టివేత.. ఇద్దరు మహిళల అరెస్టు

కమలాపూర్, న్యూస్‌టుడే: మండలంలోని ఉప్పల్‌లో బుధవారం పోలీసులు ఇద్దరు మహిళలను నుంచి రెండు కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీఐ హరికృష్ణ తెలిపిన వివరాల మేరకు.. పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా.. వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన మంతోజు స్వరూప, ఉప్పల్ గ్రామానికి చెందిన ఎండీ.షమీమ్ అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారి నుంచి ఎండు గంజాయి, రూ.17,900 నగదు, మూడు చరవాణులను స్వాధీనం చేసుకున్నారు. వీరు గతంలోనూ గంజాయి రవాణా చేస్తూ పట్టుబడి జైలుకు వెళ్లొచ్చారని సీఐ తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి గంజాయిని తెచ్చి ఇక్కడ విక్రయిస్తున్నట్లు వెల్లడించారు. వారిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు చెప్పారు.

వివాహిత ఆత్మహత్య

శాయంపేట, న్యూస్‌టుడే: వివాహిత ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శాయంపేట మండలం గట్లకానిపర్తి గ్రామానికి చెందిన బొమ్మకంటి సురేష్‌తో పరకాల మండలం కౌకొండ గ్రామానికి చెందిన ఊహ (29)కు ఏడేళ్ల క్రితం వివాహం అయింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆత్మహత్య విషయం తెలుసుకున్న సీఐ రంజిత్‌రావు, ఎస్సై ప్రమోద్‌కుమార్‌లు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని శవ పరీక్ష కోసం పరకాలకు తరలించారు. అయితే ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. ఇప్పటీ వరకు ఫిర్యాదు రాలేదని ఎస్సై పేర్కొన్నారు.

పరకాల నియోజకవర్గం

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

పరకాల, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంపీడీవో పెద్ది ఆంజనేయులు అన్నారు. బుధవారం పరకాలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో పాఠశాలల విద్యార్థులకు అండర్-14, అండర్-17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్



విజేతలతో అధికారులు, ఉపాధ్యాయులు

క్రీడలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై ప్రారంభించారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు క్రీడా దుస్తులను అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో రమాదేవి, కమిషనర్ నర్సింహ, మండల నోడల్ అధికారి సాంబయ్య, ఎస్సై రమేష్, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సురేందర్, మధు, గౌస్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతలో భాగస్వాములు కావాలి



స్వచ్ఛత పోటీలలో పాల్గొన్న విద్యార్థులతో అధికారులు

దామెర: స్వచ్ఛతలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పలు క్రీడల్లో పోటీలు నిర్వహించారు. ఎంఈవో రాజేష్‌కుమార్, ఏపీవో శారద, మనోహర్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలకు వేలం

పరకాల: పరకాల ఎక్సైజ్ పరిధిలో పట్టుబడిన 16 ద్విచక్ర వాహనాలకు బుధవారం వేలం వేసినట్లు సీఐ తాతాజీ తెలిపారు. వేలం ద్వారా ప్రభుత్వానికి రూ.3,67,084 లక్షల ఆదాయం సమకూరినట్లు పేర్కొన్నారు.

సాంఘికశాస్త్ర ల్యాబ్ ప్రారంభం

దామెర: మండలంలోని ఊరుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సాంఘీక శాస్త్ర ల్యాబ్‌ను ఏఎంవో శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవో రాజేష్‌కుమార్, ఎంఎన్‌వో జుమ్మునాయక్, డా.రాచర్ల గణపతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధి భాజపాతోనే సాధ్యం

దామెర, న్యూస్‌టుడే: దేశాభివృద్ధి భాజపాతోనే సాధ్యమని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డా.విజయచందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ల్యాదళ్ల గ్రామంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించగా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. దేశ ప్రజల సంక్షేమం, పేదరిక నిర్మూలన మోదీతోనే సాధ్యమన్నారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ సభ్యత్వాలను చేయించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు నాగరాజు, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

సైన్స్ మేళాలో గురుకుల విద్యార్థినుల ప్రతిభ

మడికొండ, న్యూస్‌టుడే: హనుమకొండ జేఎన్ఎస్‌లో యువజనోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం నిర్వహించిన సైన్స్ మేళాలో మడికొండ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల (బాలికల) విద్యార్థినులు ప్రతిభను చాటారు. స్మార్ట్ స్కూల్ ప్రాజెక్టుని ప్రదర్శించగా, కలెక్టర్ ప్రావిణ్య తిలకించి అభినందించారు. పాఠశాల్లో ఎలక్ట్రానిక్ నోటీస్ బోర్డు ద్వారా సమాచారాన్ని అందించడం, సెన్సార్‌ను ఉపయోగించి నిర్ణీత వేళకు గంట కొట్టించే విధానాన్ని ప్రవేశ పెట్టడం వల్ల ఉపయోగాలను ప్రాజెక్టు ద్వారా వివరించారు. తరగతి గదుల నుంచి విద్యార్థులు బయటకు రాగానే ఆటోమేటిక్‌గా లైట్లు, ఫ్యాన్లు ఆగిపోయేలా పద్ధతులను స్మార్ట్ స్కూల్ ప్రాజెక్టు ద్వారా తెలిపారు. జిల్లా స్థాయిలో రెండో బహుమతి సొంతం చేసుకుని రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపికయ్యారు. విద్యార్థులను, గైడ్ టీచర్‌ను కళాశాల ప్రధానోపాధ్యాయురాలు డి.ఉమామహేశ్వరి అభినందించారు.